## క్లుప్తంగా

### ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


అవినాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న సురేశ్‌గౌడ్

షాబాద్‌: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని షాబాద్‌ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్‌ మండల పరిధిలోని హైతాబాద్‌ అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో సహకార సంఘం చైర్మన్‌ చల్ల శేఖర్‌రెడ్డి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు దర్పల్లి రవీందర్‌గౌడ్‌, గోపాల్‌ రెడ్డి, సురేశ్‌గౌడ్‌, మహేందర్‌గౌడ్‌, దేవేందర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దాతల సహకారం మరువలేనిది

పోచమ్మ ఆలయం వద్ద బోరుమోటర్‌ ప్రారంభం


బోరు మోటర్‌ను ప్రారంభిస్తున్న బాల్‌రాజ్‌, దాత మల్లేశ్‌

చేవెళ్ల: ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం మరువ లేనిదని మాజీ ఎంపీపీ ఎం బాల్‌రాజ్‌ అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని నల్లపోచమ్మ ఆలయం వద్ద టేకుపల్లి మల్లేశ్‌ సొంత ఖర్చులతో బోరుమోటర్‌తో పాటు బోరుబావి వేయించాడు. మంగళవారం ఈ బోరు మోటర్‌కు పూజ చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని గ్రామదేవతలకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. బోనాలు తదితర ఉత్సవాలకు నీటి వసతి అవసరమన్నారు. దీనికోసం బోరు వేయించానని మల్లేశ్‌ పేర్కొన్నారు. ఆయన్ను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్‌ సభ్యులు కుమార్‌, రవి, ప్రశాంత్‌, క్రిష్ణ, కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ పంచాయతీగా మార్చాలని వినతి


ఆర్డీఓ సాయిరాంకు వినతి పత్రం ఇస్తున్న ధర్మసాగర్‌ వాసులు

చేవెళ్ల: ధర్మసాగర్‌ను గ్రామ పంచాయతీగా మార్చాలని కోరుతూ గ్రామస్తులు, నాయకులు చేవెళ్ల ఆర్డీఓ సాయిరాంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలలోపు తమ గ్రామాన్ని గ్రామపంచాయతీగా మార్చాలని వారు వినతి పత్రంలో కోరారన్నారు. గ్రామ పంచాయతీకి కావాల్సిన అన్ని అర్హతలు తమ గ్రామానికి ఉన్నాయని వారు ఆర్డీఓతో చెప్పారు. జనాభా పరంగా అర్హత ఉండటంతో గ్రామ పంచాయతీకి కావాల్సిన వెసులుబాటు కూడా ఉందని తెలిపారు. ప్రధాన రోడ్డుకు అనుకొని అనుబంధ గ్రామం ఉండటంతో గొల్లపల్లికి వెళ్లటానికి తమకు ఇబ్బందిగా మారిందన్నారు. ఇప్పటికే తమ గ్రామాన్ని గ్రామపంచాయతీగా మార్చాలని పలు మార్లు ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మసాగర్‌ గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

### విజయోత్సవ ర్యాలీకి తరలిరండి

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కసిరెడ్డి నారాయణరెడ్డి విజయోత్సవ ర్యాలీని బుధవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్‌ పార్టీ నాయకులు శెట్టిపల్లి సత్యం తెలిపారు. కడ్తాల మండల కేంద్రంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విజయోత్సవ ర్యాలీ ప్రారంభమవుతుందని అనంతరం ఆమనగల్లు, వెల్దండ మండలాల మీదుగా కల్వకుర్తి వరకు ర్యాలీ ఉంటుందని చెప్పారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన కాంగ్రెస్‌పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని సత్యం కోరారు.

**విజయవంతం చేయండి..**

తలకొండపల్లి: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. బుధవారం ఉదయం 9 గంటలకు కడ్తాల్‌ మండల కేంద్రంలో ప్రారంభమై, ఆమనగల్లు పట్టణం మీదుగా నాగర్‌కర్నూల్‌ జిల్లా కల్వకుర్తి పట్టణం వరకు ర్యాలీ కొనసాగుతుందని ఆయన చెప్పారు.

# కొత్తూరు రోడ్డు గుంతల మయం

- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని పనులు
- శిలాఫలకాలకే పరిమితం
- ఇబ్బందుల్లో వాహనదారులు, స్థానికులు
- పట్టించుకోని అధికారులు


గుంతలమయంగా మారిన రోడ్డు

కొత్తూరు: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా కొత్తూరు మున్సిపాలిటీలోని కొత్తూరు–అక్కివానిగూడ రోడ్డు పరిస్థితి తయారైంది. ఎన్నో నిరసనలు, మరెన్నో వినతుల మధ్యన పాలకులు మంజూరు చేసిన రోడ్డు పనులు శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. మరికొన్ని చోట్ల పనులు ప్రారంభించినప్పటికీ ఏళ్లు గడుస్తున్నా ఎక్కడి పనులు అక్కడే తిష్ట వేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కంకర తేలిన, గుంతలు, బురదమయమైన రోడ్లపై నుంచే ప్రయాణం చేయాల్సి వస్తుందని వారు చెబుతున్నారు.

**కంకర తేలిన రోడ్డు..**

మండల కేంద్రం నుంచి అక్కివానిగూడ వరకు రూ.1.76కోట్లతో మంజూరైన బీటీ రోడ్డును గత నాలుగేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ ప్రారంభించారు. కాగా పనులు ప్రారంభించి మూడేళ్లు గడుస్తున్నా కాంట్రాక్టర్‌ నేటికి పనులను పూర్తి చేయలేదు. పనుల్లో భాగంగా పాత జాతీయ రహదారి నుంచి ఎస్సీ కాలనీ వరకు సీసీ రోడ్డు, కుమ్మరిగూడ నుంచి అక్కివానిగూడ వరకు బీటీ వేశారు. మధ్యలో కొత్తూరు రైల్వేగేటు నుంచి సీఎంటీఎల్‌ గోదాం వరకు రోడ్డును అభివృద్ధి చేయకుండా అలాగే వదిలేశారు. దీంతో ఆ రోడ్డు గుంతలమయంగా మారింది. రోడ్డుపై నుంచి వాహనాల రాకపోలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఐనప్పటికీ వాహనదారులు ఇబ్బందులు పడుతునే రాకపోకలు సాగిస్తున్నారు. వాహనదారులు ఈ రోడ్డు గుండా ప్రయాణించే సందర్భంలో కిందపడ్డ దాఖలాలు కూడా లేకపోలేదు. తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంకరతేలిన రోడ్డుపై వాహనాల రాకపోకలు చేయడం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని అక్కివానిగూడ, కుమ్మరిగూడతో పాటు పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కాంట్రాక్టర్లతో సకాలంలో పనులు చేయించడంలో పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు చెబుతున్నారు. కాంట్రాక్టర్ల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ విషయంలో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**పనులు వెంటనే పూర్తి చేయాలి..**



కొత్తూరు నుంచి అక్కివానిగూడ వరకు చేపడుతున్న బీటీ రోడ్డు పనుల్లో భాగంగా రోడ్డుపై వేసిన కంకర కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు కిందపడి తీవ్రంగా గాయపడుతున్నారు. ఫాతీమాపూర్‌, కుమ్మరిగూడ గ్రామాలకు చెందిన పలువురు కిందపడి గాయాలపాలైన సందర్భాలు లేకపోలేదు. ఇప్పటికైనా పనులు వెంటనే పూర్తి చేయాలి.

– కర్రోళ్ల సురేందర్‌, కొత్తూరు.

# తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


షాద్‌నగర్‌: సమ్మెలో గ్రామీణ తపాలా ఉద్యోగులు


కేశంపేట సబ్‌ తపాలా కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న ఉద్యోగులు

- సంఘం డివిజన్‌ సెక్రటరీ విక్రమ్‌రెడ్డి

షాద్‌నగర్‌: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం డివిజన్‌ సెక్రటరీ విక్రమ్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. మంగళవారం మొగిలిగిద్ద గ్రామంలోని సబ్‌ డివిజన్‌ కార్యాలయ గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగుల పని పరిస్థితులు వేతనాల పరిశీలన కోసం నియమించబడిన కమలేశ్‌ చంద్ర కమిటీ నివేదికను అమలు పరచకుండా గ్రామీణ తపాలా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆసరా పెన్షన్‌ డబ్బులు, ఉపాధి హామీ కూలీలకు డబ్బులను పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రజలకు ఎళ్లవేళల అందుబాటులో ఉన్న తమకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ తపాలా ఉద్యోగులను 4 నుంచి 5గంటలు పని చేస్తున్నట్లుగా పరిగణనలోకి తీసుకోవడం బాధాకరమన్నారు. తమకు పెన్షన్‌తో పాటుగా అన్ని రకాల ప్రయోజనాలు కల్పించాలని వారు డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో ఆజీమ్‌, మహ్మద్‌ అలీ, వెంకట్‌రెడ్డి, మధుకర్‌, రాజు, కస్తూరి, మేఘన, అర్జున్‌, సమ్రీన్‌ తదితరులు పాల్గొన్నారు.

**కేశంపేటలో..**

కేశంపేట: న్యాయయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని సబ్‌ తపాలా కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ కమలేష్‌ చంద్ర కమిటీ రిపోర్టును అమలు చేయాలన్నారు. మసూద్‌అలీ, రాములు, సాయిలు, దేవేందర్‌, నూర్జహాన్‌బేగం, శ్రీను, రమేశ్‌, బాలు, మహేష్‌, కీర్తిరెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అవార్డు రావడం అభినందనీయం

- కేఎల్‌ యూనివర్సిటీ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రామకృష్ణ


అవార్డును ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రామకృష్ణ

మొయినాబాద్‌రూరల్‌: 'ఏఐసిటిఈ ఎడ్యూ స్కిల్స్‌ కనెక్ట్‌–2023' దేశంలో 1500లకు పైగా సంస్థలు వివిధ విభాగాల్లో పోటీ పడినప్పటికీ కేఎల్‌ యూనివర్సిటీకి అవార్డు రావడం అభినందనీయమని ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రామకృష్ణ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌ మండల పరిధిలోని అజీజ్‌నగర్‌ సమీపంలోని కేఎల్‌ యూనివర్సిటీకి అవార్డు వచ్చిన సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవార్డు గురించి వివరించారు. కేఎల్‌హెచ్‌ హైదరాబాద్‌ క్యాంపస్‌ గోవాలో జరిగిన ఏఐసీటీఈ ఎడ్యూ స్కిల్స్‌ కనెక్ట్‌–2023 కన్‌క్లేవ్‌లో ప్రత్యేకంగా నిలిచి అవార్డును పొందిందని తెలిపారు. విద్యా, నైపుణ్యాభివృద్ధిలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించిందన్నారు. వర్చ్యువల్‌ ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్య ధ్రువీకరణలు క్యాంపస్‌లోని నిపుణులైన అధ్యాపకుల మార్గదర్శకంలో విద్యార్థులు చేపట్టిన ప్రభావంతమైన ప్రాజెక్టులకు విశ్వవిద్యాలయం యొక్క సహకారానికి బెస్ట్‌ అవార్డు వచ్చిందన్నారు. ఈ అవార్డు కేఎల్‌ యూనివర్సిటీకి రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఆల్‌ ఇండియాలో 3వ ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. అంతేకాకుండా ఆసియా బుక్‌ ఆఫ్‌ రికార్డు నమోదు ద్వారా విశ్వవిద్యాలయం ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్‌ సైన్స్‌ ఇంజనీరింగ్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ కె శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

మంచాల: మండల పరిధిలోని నోముల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠశాలలో తరగతులు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్ర ధానోపాధ్యాయుడు సత్తా రి రాజిరెడ్డి, ఉపాధ్యాయులు బాలునాయ క్‌, నవనీత, విజయ్‌కుమార్‌, రజినీ, పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎయిర్‌ ఇండియా రిటైర్డ్‌ హెడ్‌ సిములేటర్‌ మెయింటెనెన్స్‌ అధికారి రాంబాబు

మొయినాబాద్‌రూరల్‌: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎయిర్‌ ఇండియా రిటైర్డ్‌ హెడ్‌ సిములెటర్‌ మెయింటెనెన్స్‌ అధికారి జి రాంబాబు, హెచ్‌ఆర్‌వెస్ట్‌ రీజినల్‌ అధికారి డాక్టర్‌ శారదావెంకటేశ్‌లు పేర్కొన్నారు. మొయినాబాద్‌ మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలో గల బంటారం ప్రాథమిక పాఠశాలలో ప్రిన్సిపాల్‌ ఉషారాణి ఆధ్వర్యంలో ఇగ్నైట్‌ ఫెస్ట్‌ నిర్వహించారు. ఈ ఫెస్ట్‌లో రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ 16 గురుకుల పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముఖాముఖి, క్విజ్‌, స్పెల్‌బీ వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకునేందుకు అన్ని పోటీల్లో పాల్గొనాలని సూచించారు. జ్ఞాన సముపార్జనకు పరిసరాలను అధ్యాయనం చేయాలని వారు పేర్కొన్నారు. ఆత్మస్థైర్యం ఉంటే దేనినైనా సాధించగలరని వారు తెలిపారు. చేవెళ్ల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్‌ మాదేవి, ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్‌ శివారెడ్డి, ప్రవీణ్‌, అనిత, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్‌ శారదావెంకటేశ్‌

# కాంగ్రెస్‌తోనే గిరిజనుల అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి


ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న గిరిజన సంఘం నాయకులు

షాద్‌నగర్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వంతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో షాద్‌నగర్‌లో కాంగ్రెస్‌ గెలుపునకు కీలక పాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిని గిరిజన సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేపట్టిన ప్రజావ్యతిరేఖ విధానాలతో ప్రజలు పూర్తి విసిగిపోయారన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ గెలుపులో గిరిజనులు కూడా కీలక పాత్ర పోషించారని అన్నారు. తండాల్లో గిరిజనులకు చేయాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్‌ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ముందుంటుందని అన్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనుల్లో ప్రజలందరు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు చౌలపల్లి ప్రతాప్‌ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్‌ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో రెండింటిని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో బిచ్చు నాయక్‌, లక్ష్మణ్‌ నాయక్‌, రవీందర్‌ నాయక్‌, రాజు నాయక్‌, శ్రీను నాయక్‌, మోహన్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

- ఎంపీటీసీ పొన్న జయమ్మవెంకట్‌రెడ్డి, సర్పంచ్‌ నరేందర్‌రెడ్డి


బస్సును ప్రారంభిస్తున్న జయమ్మవెంకట్‌రెడ్డి, సర్పంచ్‌ నరేందర్‌రెడ్డి

షాబాద్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరమని హైతాబాద్‌ ఎంపీటీసీ పొన్న జయమ్మవెంకట్‌రెడ్డి, మద్దూరు సర్పంచ్‌ పి నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం షాబాద్‌ మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ గ్రామంలో రాజేంద్రనగర్‌ డిపో బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల సాధికారత కాంగ్రెస్‌ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలో మిగిలిన గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. వంద రోజుల్లో కాంగ్రెస్‌ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైతాబాద్‌ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్‌రెడ్డి, వడ్ల సతీష్‌, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్రస్థాయిలో బహుమతులు గెల్చుకోవడం అభినందనీయం
- సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌ రమాదేవి


బహుమతి ప్రదానం చేస్తున్న పి శృతి, ఎస్‌ వైష్ణవి

మొయినాబాద్‌రూరల్‌: తొమ్మిదోవ రాష్ట్ర స్థాయి క్రీడల్లో చేవెళ్ల గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి, విజయదుంధుబి మోగించడం అభినందనీయమని సాంఘిక సంక్షేమ గురుకుల బాలిక పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌ రమాదేవి పేర్కొన్నారు. డిసెంబర్‌ 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మేడ్చల్‌ జిల్లా మల్కాజిగిరిలో జరిగిన స్పోర్ట్స్‌ మీట్‌లో సాంఘిక సంక్షేమ చేవెళ్ల బాలికల కళాశాల విద్యార్థులు అండర్‌ 14 అథ్లెటిక్స్‌లో ఎస్‌ వైష్ణవి 600 మీటర్లలో రెండోస్థానం కైవసం చేసుకుంది. దీంతో ఆమె రాష్ట్రస్థాయిలో ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌కు ఎంపికైంది. అదే విధంగా అండర్‌ 17 విభాగం పి శృతి 9వతరగతి 400 రిలేలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. అనంతరం పశ్చిమ ప్రాంతీయ సమన్వయ అధికారి శారదావెంకటేశ్‌, ప్రిన్సిపాల్‌ రమాదేవి, అధ్యాపకులు విజేతలను అభినందించారు.

# వాహనదారులకు హెల్మెంట్‌ తప్పనిసరి


వాహనాల తనిఖీలో ఎస్‌ఐ కిషన్‌జీ, శివారెడ్డి

మొయినాబాద్‌రూరల్‌: ద్విచక్ర వాహనాదారులు హెల్మెంట్‌ తప్పనిసరిగా ధరించాలని మొయినాబాద్‌ ఎస్‌ఐ కిషన్‌జీ అన్నారు. మంగళవారం మండల పరిషత్‌ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై ఎస్‌ఐ కిషన్‌జీతో పాటు ఏఎస్‌ఐ శివారెడ్డి, సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెంట్‌ లేని వారికి ఛలాన్లు వేశారు. అనంతరం ఎస్‌ఐ కిషన్‌జీ మాట్లాడుతూ ప్రమాదాలను నివారించాలంటే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెంట్‌ ఉపయోగించాలన్నారు. వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు.

# చలికాలం.. మూగ జీవాలు పైలం

- జాగ్రత్తలు తీసుకోకపోతే నష్టం తప్పదు
- వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి
- రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్‌ చంద్రశేఖర్‌రెడ్డి


తాళ్లపల్లిలో పశువులకు చికిత్స చేస్తున్న డాక్టర్‌ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్‌: మానవ మనుగడకు ప్రకృతి సంపదతో పాటు పశుసంపద కూడా చాలా ముఖ్యం. ప్రత్యక్షంగా, పరోక్షంగా మానవ సమాజానికి పశుసంపద ఎన్నో విధాలుగా మేలు చేస్తున్నది. కాలానికి అనుగుణంగా ఆరోగ్యంపై మనుషులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో పశువులకు కూడా అలాంటి జాగ్రత్తలు అవసరం. చలికాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా పోషకులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రోజు రోజుకూ చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గొర్రెలు, మేకల్లో దొమ్మ, జలుబు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. ఈ విషయంలో పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్‌ చంద్రశేఖర్‌రెడ్డి సూచిస్తున్నారు.

**దొమ్మ రోగం..**

- దొమ్మ రోగం వ్యాప్తికి పలు రకాల బ్యాక్టీరియాలు, వైరస్‌లు, పరాన్న జీవులు కారణమవుతున్నాయి. కంటేజీఎస్‌ కాప్రెన్‌ ప్లూరో నియోనియా అనే వైరస్‌ కారణంగా మేకలకు మాత్రమే తరుచుగా ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకిన జీవాలకు జ్వరం తీవ్రంగా ఉంటుంది.
- వేగంగా శ్వాస పీల్చుకోవడం, ఎగశ్వాస, ముక్కు నుంచి నీరు, చీమిడి కారడం, ఆకలి లేకపోవడం రోజు రోజుకూ నీరసించి పోతాయి.
- కళ్ల ఎర్రబడి నీరు కారడం, వీపు భాగం వంగి ఉండటం, తల, మెడ ముందుకు సాగినట్లు కనిపిస్తాయి. అంతేకాకుండా ముక్కు రంధ్రాలు వెడల్పవుతాయి.
- త్వరగా చికిత్స చేయించకపోతే ఊపిరితిత్తులు వాచి వాటికి చీము పట్టే ప్రమాదముంది. ఈ లక్షణాలు అమ్మతల్లి వీవీఆర్‌ మొదలైన జబ్బుల్లో కూడా కనిపిస్తాయి. ఎప్పటికప్పుడూ టీకాలు వేయించాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం, శుభ్రమైన నీటిని అందించాలి.


చంద్రశేఖర్‌రెడ్డి పశు వైద్యుడు

**జలుబు, దగ్గు..**

ఈ వ్యాధి సోకినప్పుడు పశువులకు తుమ్ములు, కోళ్లు, ముక్కు నుంచి నీరు కారడం, చీమిడి పసుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

- పశువుల పాక ఇరుకుగా ఉండడం, గాలి వెలుతురు సరిగా లేకపోవడం, పాకల్లో తేమ, తడి ఎక్కువగా ఉండటం కాలుష్యం, దుమ్ము వాతావరణంలో అకస్మాత్తుగా వచ్చే మార్పులు ఈ జబ్బుకు కారణమవుతుంటాయి.
- అలాగే క్రిముల ద్వారా సోకే అంటు వ్యాధులతో పాటు బయట నుంచి ఆహారం ద్వారా శ్వాసకోశంలోకి చచ్చే కణాలు, నూనె పదార్థాలు కూడా జలుబు, దగ్గుకు కారణమవుతాయి.


మాచన్‌పల్లిలో గొర్రెల మంద

- దీని నివారణకు పాకలోకి గాలి, వెలుతురు వచ్చేలా చూడాలి. వాతావరణం సరిగా లేనప్పుడు జీవాలను బయటకు వదలకూడదు. పాకను శుభ్రంగా ఉంచుకోవాలి. జబ్బు సోకినప్పుడు పశువైద్యాధికారులను సంప్రదించాలి.
- ఒక వేళ జీవి చనిపోతే పోస్టుమార్టం ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి మందలోని మిగిలిన జీవులకు చికిత్స చేయించాలి. ఈ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా దొమ్మ టీకా వేయించాలి.